'జయ జయహే' బాణీ బాగాలేదు!

రాష్ట్ర గీతంపై నెటిజన్ల పెదవి విరుపు

కీరవాణిపై సోషల్ మీడియాలో విమర్శలు • పాత పాటే బాగుండేదంటూ పోస్టులు

కీరవాణి ఖూనీ చేశారంటూ ఆవేదన • మళ్లీ స్వరపర్చాలని పెరుగుతున్న డిమాండ్లు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'ను స్వరపర్చిన విధానంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏండ్లుగా పాడుకుంటున్న పాట ట్యూన్‌ను మార్చేయడంతో 'తెలంగాణ ఆత్మ' కరువైందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఇది రాష్ట్ర గీతమా? తెలంగాణ ప్రజల మనసులకు చేస్తున్న గాయమా?' అని దుమ్మెత్తిపోస్తున్నారు. పాతపాటే బాగుండేదని, కొత్త పాటను ఖూనీ చేశారని మండిపడుతున్నారు. వాస్తవానికి జయజయహే తెలంగాణకు సంగీతం అందించే బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి పిలిచిమరీ కీరవాణికి అప్పగించిన ప్పటి నుంచే తెలంగాణలో వ్యతిరేకత మొదలైంది. 'స్వరాష్ట్రంలో మన గీతానికి సంగీతం అందించేవారే కరువయ్యారా?' అంటూ తెలంగాణ సమాజం నిలదీసింది. దీనికితోడు.. 'కీరవాణిని తలదన్నే సంగీత దర్శకుడు ఎవరైనా ఉన్నాడా?' అని సాక్షాత్తు గేయ రచయిత అందెశ్రీ అనటంతో ఈ ఆవేదన తారస్థాయికి చేరింది. తీరా.. అంచనాలను అందుకోవటంలో గీతం విఫలమైంది. దీంతో తమ మనసులు గాయపడ్డాయంటూ నెటిజన్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'కొత్త పాట కంటే పాత పాటే బాగుండె' అని ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టా, థ్రెడ్ వేదికలపై నిరసన కామెంట్లు పెడుతున్నారు.

తెలంగాణ సోయికి 'ఆస్కార్'ం లేని పాట

రాష్ట్ర గీతం తెలంగాణ సోయికి 'ఆస్కార్'ం లేని పాటగా మిగిలిపోయిందని నెటిజన్లు మండిపడుతున్నారు. 'విక్రమార్కుడు మూవీలో ఫ్లాష్‌బ్యాక్‌లో పోలీస్ రవితేజ ఎంట్రీ సీన్, మగధీర మూవీలో 'నిన్ను పొందేటందుకే' అనే పాట మధ్యలో బీజీఎమ్, ఖలేజా మూవీలో ఓం నమః శివ రుద్రయా' అనేపాట, బాహుబలి మూవీలో 'ఎవ్వడంట ఎవ్వడంట నిన్ను ఎత్తుకుంది' అనే పాటలోని సంగీతాన్ని మిక్స్ చేసి విడుదల చేసిన పాట ఇది. దీనికి కీరవాణి అవసరమా?' అంటూ సుబ్బు నందిమళ్ల అనే నెటిజన్ ఫేస్‌బుక్ వేదికగా కామెంట్ చేశాడు. 'చక్కటి పదాల పొందికతో తెలంగాణ ఔన్నత్యాన్ని చాటిన గీతాన్ని ఖూనీ చేశారు.

తెలంగాణ గీతం అంటే సినిమా పాట కాదు. తెలంగాణ అంటేనే ఒక ధిక్కార స్వరం, ఒక ఉద్యమ శిఖరం, ఉవ్వెత్తున ఎగిసిన సమరం. మలిదశ ఉద్యమం ప్రారంభమయ్యాక 15 ఏండ్ల నుంచి పాడుకుంటున్న 'జయ జయహే తెలంగాణ గేయం' అస్తిత్వాన్ని పూర్తిగా కోల్పోయింది. అంధకారంలో చిక్కుకున్న అందెశ్రీ ఈ తెలంగాణ గేయానికి చేసిన గాయం తెలంగాణ ప్రజల మనసును బాధించింది' అంటూ రాజోజీ సాయిరామ్ చారి అనే నెటిజన్ ఆవేదన వ్యక్తం చేశారు. కామెంట్లను ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు ఓసారి చదవాలని జ్యోతిష్య సత్యం అనే నెటిజన్ సూచించారు. 'అసలు ఈ కామెంట్లు చూసైనా కాంగ్రెస్‌వాళ్లు మారండి. మీ ముఖ్యమంత్రి గారి దగ్గర ఉండి సలహాలు ఇచ్చే వారితో పూర్తిగా పాలన చెడిపోతున్నది. ప్రజలందరితో ఛీత్కారానికి గురవుతున్నారు. వారిని వీలైనంత తొందరగా పక్కకుపెట్టాలి. మళ్లీ ముఖ్యమంత్రి దగ్గరకు రానీయకుండా చూసుకోండి. పిచ్చి పిచ్చి సలహాలతో తుగ్లక్ పరిపాలనలా అవుతుంది. ఉన్నవి తీసేస్తూ ఏవో పిచ్చివి పెడుతూ పిచ్చిపిచ్చిగా అవుతుంది. కీరవాణి సంగీతం బాగా లేదు. దాన్ని పూర్తిగా స్లో మోషన్‌లో పాడించిన విధానం బాగా లేదు. మీరు ఈ పాట పోస్ట్ చేసిన తర్వాత ఎంతమంది నెగెటివ్ కామెంట్స్ చేశారో చూడండి. అందరూ బీఆర్ఎస్ పార్టీ అనుకొంటే తప్పు. ఏ పార్టీకి పూర్తిగా చెందకపోయినా (నేను బీజేపీ అభిమానిని) ఉన్న వాస్తవం చెప్తున్నానన్నది గ్రహించాలి' అంటూ సుదీర్ఘంగా తన ఆవేదన వెళ్లగక్కారు.

> గుర్తింపు లేనిదే విద్యార్థుల పాఠ్య పుస్తకాలలో ఎలా ఉన్నది? కేసీఆర్ ఎప్పుడో ఈ పాటను పాఠ్య పుస్తకాలలో ముద్రించారు. కొన్ని మార్పులు చేస్తాం అంటే అప్పుడు ఒప్పుకోని అద్దెశ్రీ ఇప్పుడు ఎలా ఒప్పుకున్నాడు? ఈ పాటలోనే ఉన్నది.. 'కవిగాయక_వైతాళిక_కలల_మంజీరాలు జాతిని_జాగృతం_పరిచే_గీతాల_జన జాతర' అని రాసిన వ్యక్తి ఈ రోజు తెలంగాణలో అసలు పాటలు పాడే వారు లేరు అంటున్నడు. అంటే పాట తప్పుగా రాశాడా లేక అతని ఆలోచనలు తప్పా? అసలు జై తెలంగాణ అంటే గొంతులో గాంభీర్యం ఉండాలి. కానీ ఇప్పుడు పాడిన పాటలో అది ఒక రొమాంటిక్ పాటలా ఉన్నది. మన వాళ్లు అయితే మన యాసలో ఏ పదం ఎలా పాడాలి? అని బాగా తెలుస్తుంది. సినిమా పాటలు పడేవారిని పాడిస్తే ఇలానే ఉంటుంది.
- వరుణ్‌రాజ్ బాగం

బరాబర్ అడుగుతాం

'కీరవాణిని అహో ఓహో అని సమర్థించిన వారు ఒకసారి ఆ పాట అనబడేది ఒకసారి విన్నారా? విని ఇప్పుడు ఆనందించండి' అంటూ కోవెల సంతోష్‌కుమార్ అనే నెటిజన్ ఆవేదన వ్యక్తం చేశారు. 'అందెశ్రీ స్పష్టంగానే అన్నారు.. ఎక్కడ ఎలా ఒక్కరితో అయినా అన్నా అన్నట్టే. కచ్చితంగా అడుగుతం.. కాళేశ్వరం మీద కేసీఆర్‌కు, రాష్ట్ర గీతం మీద రేవంత్‌కు గంపగుత్తా హక్కు లేదు. కాళేశ్వరానికీ.. ఈ పాటకూ సంబంధం లేదు. ఇది ఈ ప్రాంత కళాకారులను నీచంగా, హేయంగా.. అన్నింటికీ దిగజారి తిట్టిన సందర్భం. కచ్చితంగా అడుగుతాం. ఆస్కార్ అవార్డు అందుకున్న ఆయనకు కచ్చితంగా ఈ ప్రాంత భావోద్వేగంపై ఏమాత్రం అవగాహన లేదు.. రాదు. అది ఇప్పుడు తేలిపోయింది కూడా. కచ్చితంగా ప్రాంతాలను బట్టి ఉద్యమాలను బట్టి, వాటిలో ఉద్వేగాలను బట్టి మాత్రమే సంగీతంలో చైతన్యం ప్రస్ఫుటీకరిస్తుంది. ఇక్కడి వాళ్లను తిట్టినప్పుడు కచ్చితంగా ప్రశ్నించాల్సి వస్తుంది. నూతన గీతంపై సోషల్ మీడియాలో వస్తున్న కామెంట్స్‌లో 99 శాతం ఆవేదన, నిరసన తెలుపుతూ వచ్చేవే. మిగిలిన ఒక శాతం డైహార్డ్ కాంగ్రెస్ అభిమానులు పెడుతున్నవే. అవి కూడా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పేజీల్లోనే. అయితే.. కాంగ్రెస్ సోషల్ మీడియా పేజీల్లో కూడా నూతన గీతంపై పెడుతున్న కామెంట్స్ దారుణంగా ఉన్నాయి.

కులాల పేర్లు ఎందుకు తీసేశారు?

ఉద్యమ సమయంలో రాసిన గేయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రకులాల్లో కొందరి పేర్లు ఉండేవని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. కొత్త పాటలో కులాల పేర్లే మర్చిపోయారని విమర్శించారు. బహుజన రెడ్డి సామాజిక వర్గం లేకపోవటంతో ఆయన ఆదేశించి ఉంటాడు.. ఈయన తీసేసి ఉంటారు' అని ఎద్దేవా చేశారు.

> పగోడితో పంచాంగం చెప్పిచ్చుకున్నట్టే ఉన్నది. ఓ ఫీల్ లేదు, పాడూలేదు. ఎంతచక్కటి పాటను ఆగం చేస్తిరి
> **- మహేశ్వర్ గౌడ్ సాబ్ కొత్త**

> ఇప్పుడు వదిలిన జయ జయహే తెలంగాణ పాట కంటే, జయము జయము చంద్రన్న పాటే నయం అన్పిస్తుంది.
> **- గణేశ్ రేగట్ట**

> కీరవాణి రాగంలో వణికిందొక హృదయం
> **- నరేష్‌కుమార్ సూఫీ**

> ఆంధ్రోడు సమకూర్చితే కానీ తెలంగాణ అధికార గీతం రూపు దిద్దుకోలేని చేతగాని వారు మీరు మాతో పోటీనా? అనే విమర్శలకు అందెశ్రీ కారకుడయ్యాడు. సంగీత దర్శకుడికి మాత్రం మంచి అవకాశం. కీరవాణి చరిత్రకెక్కాడు. పాపం తెలంగాణ మళ్లీ ఎక్కిరింపుల పాలు కానున్నది.
> **- చంద్రమౌళి రామ్‌దేని**

> పాత రాగం వద్దనుకొని.. కొత్త రోగం తెచ్చుకున్నట్లైంది. పాపం! అందెశ్రీ.. తాను కూడా పాడలేనట్టుగా పాటను మార్చపారేశాడు. కీరవాణి బాహుబలి బీజీఎంలో జంపర్లు.. రాజన్న సినిమా పాట బీజీఎంలను కలగలిపి కానిచ్చేశాడు. మొత్తానికి బిర్యానీ కాస్తా... పులావ్ అయిందన్నమాట
> **- అన్‌నోన్ నెటిజన్**

> ఏం కీరవాణి ప్రాణం పెట్టి ట్యూన్ చేయలేదా? అతనికి భావోద్వేగం రాలేదా? కనీసం అందరికీ అర్థమయ్యే భాష కూడా రాయని జాతి గీతానికి ఇంత విలువ దక్కటం వల్ల ఉద్వేగమేమో! ఇతని రాత కన్నా అప్పట్లో రాసిన శంకరంబాడి సుందరాచారి ఎంతో బెటర్. ఆయన భావంలో ప్యూడలిజం ఉన్నా, కనీసం భాషలోనైనా ఆధునికంగా నిలబడ్డాడు!
> **- సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్**

> జయ జయహే తెలంగాణ పాట బ్రాహ్మణీయ వెర్షన్ బాగుంది.
> **- అభినవ్ బూరం**

> మొన్నటి వరకు ఆ పాటను పాడుకుంటుంటే మన పాట లాగా అనిపించేది. ఇప్పుడు మనది అనే ఫీల్ రావడం లేదు.
> **- ప్రభాకర్ లక్కం**

> అందెశ్రీ.. నీ బాంచెన్ గా కీరవాణి పాట మహఘోరంరా నాయనా. నీ కాల్మొక్కతా... గా ట్యూన్ వద్దని సర్కారోడికి చెప్పు. కనీసం నువ్వు పాడిందే ఉంచు.. లేకుంటే రామకృష్ణ పాడింది లేదా తెలంగాణ ట్యూన్ అని యూట్యూబ్‌లో ఇంకెవరో స్వరపరచింది. ఆ పాట మహాబాగుంది.. దాన్ని ఉంచుమను. ఆత్మలేని పాట ఎవడికి కావాలె? నీ గుండె నింపినది కావాలె కదా. ఓ అందెశ్రీ.. నీ బాంచెన్.. ఒద్దురా నాయనా .. మాకా కొత్త ఉత్త పాట ఒద్దుకాక ఒద్దు.
> **- యాళ్లగడ్డ రాఘవేంద్రరావు**

ఆత్మగౌరవపు కర్రుకు కృత్రిమ అద్ది వెలుగులు సరితూగవు!

> లక్షమంది కీరవాణిలు వచ్చినా సరే ఈ పాటను రీక్రియేట్ చేయలేరు. ఎందుకంటే.. సరిగమలు, గమకాలు, తాళాలు, రాగాలతో అల్లిన పాట కాదిది. కోట్లాది తెలంగాణ బిడ్డల ఆకాంక్షలు.. సాహిత్యమై! ఏకోన్ముఖ పోరాటంలో చేయిచేయి కలిపిన ప్రతి తెలంగాణ గుండె చప్పుళ్లే సంగీతమై! ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలంతా గుండెలకు హత్తుకున్న వెచ్చదనంతో, చల్లారిన నెత్తురులో ఆత్మగౌరవపు బడబాగ్నులు రగిలించిన భావోద్వేగ సునామీ అది. కిరాయి గళాలకో.. పరాయి వాయిద్యాలకో.. అంతటి ఆరాటపు పదునెక్కడిది. ఆస్కార్ ఆర్భాటాలు కాదు.. తెలంగాణతనపు వాడిదనాన్ని ఆవిష్కరించే ఆస్కారం కదా కావాల్సింది.
> **- అజయ్ కుమార్ కోదం**

హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

రాష్ట్ర గీతాన్ని సమాజం అంగీకరించదు

- **ప్రజల గుండెల్లో నిలిచిన సంపూర్ణ గీతాన్ని ఆమోదించాలి**
- **రాష్ట్ర గీతంపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తాం**
- **ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ**

హనుమకొండ, జూన్ 3: మార్పులు చేసి ఆమోదించిన జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం కొత్త రాష్ట్ర గీతాన్ని తెలంగాణ సమాజం అంగీకరించదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సోమవారం ఆయన హనుమకొండలో మీడియాతో మాట్లాడారు. ప్రజల గుండెల్లో నిలిచిన సంపూర్ణ గీతాన్ని మాత్రమే ఆమోదించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో పాల్గొనలేదని, అందుకోసం ఆయన రాష్ట్ర అవతరణ వేడుకల్లో తన గురించి చెప్పుకోలేకపోయాడని ఎద్దేవా చేశారు. రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ తోరణాన్ని ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించారు. చార్మినార్ వారసత్వ సంపద అని గుర్తుచేశారు. సమ్మక్క సారక్కను చంపింది కాకతీయ రాజులే అయితే గిరిజనులను పొట్టన పెట్టుకున్నది కాంగ్రెస్ కాదా? అని ప్రశ్నించారు. కాకతీయ కళా తోరణం గొప్ప వారసత్వ సంపదగా అందరూ గుర్తిస్తున్న విషయాన్ని స్పష్టం చేశారు. అందెశ్రీ రాసిన గీతాన్ని మార్చి సారం లేకుండా చేశారని ఆయన ఆరోపించారు. సమ్మక్క, సారక్క, కుమ్రంభీమ్ పేర్లను తొలగించడాన్ని మంత్రి మంత్రి సీతక్క ఒప్పుకొంటారా? అని ప్రశ్నించారు. కంచర్ల గోపన్నతో సహా కవుల పేర్లు కొత్త గీతంలో లేకపోవడాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంతోమంది బ్రాహ్మణ కవుల పేర్లు లేవనే విషయాన్ని మంత్రి శ్రీధర్ బాబు అంగీకరిస్తారా? ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మాట విని అందెశ్రీ తనకు ఉన్న గౌరవాన్ని కోల్పోయారని విచారం వ్యక్తంచేశారు. జయ జయహే తెలంగాణ గీతంలో రెడ్డిల పేరు ఎక్కడ లేకపోవడంతో ఇక వేరే ఇతర కులాల పేర్లు ఎందుకని పాటలో వచ్చిన మిగతా కులాల గొప్ప వ్యక్తుల పేర్లను లేకుండా రేవంత్‌రెడ్డి చేశారని విమర్శించారు. కాసు బ్రహ్మానందరెడ్డి పార్కు పేరును తొలగించి అమరుల పార్కుగా మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గీతంపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని, అన్ని రాజకీయ పక్షాలను కలుస్తామని మంద కృష్ణ తెలిపారు.

అమరుల కుటుంబాలకు 25 వేల పింఛన్

- **తెలంగాణ ఉద్యమం ఫుట్‌బాల్ గ్రౌండ్**
- **అందరూ ఆడితేనే రాష్ట్రం వచ్చింది**
- **రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

న్యూశాయంపేట, జూన్ 3: తెలంగాణ అమరుల కుటుంబాలకు ప్రతి నెలా రూ.25 వేల చొప్పున పెన్షన్ చెల్లిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఉద్యమకారులకు ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. సోమవారం హనుమకొండలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణ అమరుల కుటుంబాలను గౌరవించుకుందామని, వారికి సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. ఎక్కడా ఉద్యమకారులను అగౌరవపర్చలేదని స్పష్టంచేశారు. తెలంగాణ ఉద్యమం ఫుట్‌బాల్ గ్రౌండ్ లాంటిదని, అం దరూ ఆడితేనే రాష్ట్రం వచ్చిందని, అందులో డోల్ కొట్టేవాడికే గుర్తింపు ఉంటుందని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేరుస్తామని, వారి త్యాగాలను స్మరించుకోవడం చాలా అవసరమని సూచించారు. మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు శోభారాణి, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు.

భూగర్భ వేడినీటి ఆవిరితో విద్యుత్తు

- **జియో థర్మల్ పవర్‌పై సింగరేణి ఫోకస్**

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): భూగర్భం నుంచి సహజ సిద్ధంగా లభించే వేడినీటి ఆవిరితో విద్యుత్తు ఉత్పత్తిపై సింగరేణి సంస్థ దృష్టి సారించింది. రానున్న రోజుల్లో ఓఎన్‌జీసీ భాగస్వామ్యంతో భారీ జియో థర్మల్ ప్లాంట్లను నిర్మించాలని యోచిస్తున్నది. ప్రాథమికంగా 200 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటికే మణుగూరు సమీపంలోని పగిడేరు వద్ద ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన జియో థర్మల్ విద్యుత్తు కేంద్రం విజయవంతమైంది. సింగరేణి సంస్థ తన సొంత అవసరాల కోసం పడిగేరు వద్ద 4 బోర్లు వేసింది. వీటి నుంచి మోటర్లు లేకుండానే భారీగా వేడి జలాలు ఉబికివచ్చాయి. 65 నుంచి 80 డిగ్రీల వేడి తో ఉన్న ఈ జలాలు భూమి నుంచి బయటకు రాగానే ఆవిరవుతున్నాయి. దీనిపై అధ్యయనం చేయించారు. ఈ నీరు కనీసం 20 ఏండ్లపాటు లభ్యమవుతుందని నిపుణులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో జియో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది.

గ్రేటర్‌లో విద్యుత్తు కోతలు

- **గంటల తరబడి కరెంటు లేక ఇబ్బందులు**
- **తాజాగా బోడుప్పల్ సబ్‌స్టేషన్ ముట్టడి**

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్తు కోతలు నిత్యకృత్యంగా మారాయి. మూడు రోజుల క్రితం బాచుపల్లి, రెండురోజుల క్రితం రాజేంద్రనగర్, జీడిమెట్ల, తాజాగా బోడుప్పల్‌లో విద్యుత్తు కోతలతో స్థానికులంతా సబ్‌స్టేషన్‌లను ముట్టడిస్తున్న పరిస్థితులు. ఇదిలా ఉంటే.. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రంలో కరెంటు కోతలు లేవని, 24 గంటలు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 5.20 గంటల నుంచి రాత్రి 10.25 నిమిషాల వరకు విద్యుత్తు సరఫరాలో తీవ్ర అంతరాయాలు తలెత్తడంతో స్థానికులంతా కలిసి బోడుప్పల్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. రెండు రోజుల క్రితం ఇదే తరహాలో బాచుపల్లి సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళనకు దిగి ధర్నాలు చేశారు. రాజేంద్రనగర్‌లోని కిస్మత్‌పూర్ సెక్షన్, జీడిమెట్లలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహాలో అర్ధరాత్రి గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో అంధకారం అలుముకున్నది. గ్రేటర్‌లో వరుసగా జరుగుతున్న సంఘటనలు విద్యుత్తు సరఫరా వ్యవస్థ తీరుకు అద్దం పడుతున్నాయి. ఏటా వర్షకాలంలో ఈదురుగాలుకు చెట్లు, కొమ్మలుపడి విద్యుత్తుకు అంతరాయం కలగటం కామన్. అయినప్పటికీ, అలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు విద్యుత్తుశాఖ యంత్రాంగం సిద్ధంగా లేకపోవటానికి పై సంఘటనలే ప్రత్యేక నిదర్శనమని విద్యుత్తు నిపుణులు పేర్కొంటున్నారు. ఒకేసారి ఎక్కువ చోట్ల చెట్లు, కొమ్మలు విరిగి విద్యుత్తు తీగలు, స్తంభాలపై పడటంతో పునరుద్ధరణలో ఆలస్యమైందని చెప్తున్న అధికారులు.. సమస్య తీవ్రతకు అనుగుణంగా ప్రత్యేక బృందాలతో పనులు చేపట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. టీజీఎస్పీడీసీఎల్ సంస్థ ట్విట్టర్ వేదికగా ఇచ్చిన వివరణలోనూ సాయంత్రం 5.20 నుంచి రాత్రి 10.25 వరకు పునరుద్ధరణ పనులు చేపట్టామని తెలిపింది. అయినా, కరెంటు కోతలు లేవని సీఎం రేవంత్ చెప్పటం హాస్యాస్పదంగా ఉన్నదని వినియోగదారులు మండిపడుతున్నారు.

చేవెళ్ల మండలం ఈర్లపల్లి సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎన్కేపల్లి గ్రామస్థులు

ఈర్లపల్లి సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్థులు

చేవెళ్ల రూరల్ : విద్యుత్తు కోతలపై రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఎన్కేపల్లివాసులు మండిపడ్డారు. విద్యుత్తు కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రాత్రులు నిద్రపట్టడం లేదని, అరుగులపై కూర్చోవాల్సి వస్తున్నదని, అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆగ్రహిస్తూ సోమవారం ఈర్లపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. ఈర్లపల్లి, ఎన్కేపల్లి, గొల్లగూడ, కమ్మెట గ్రామాలకు ఈర్లపల్లి సబ్‌స్టేషన్ నుంచే కరెంట్ సరఫరా అవుతున్నదని.. ఎన్కేపల్లికి తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతున్నదని తెలిపారు. తమ గ్రామానికే విద్యుత్తు సరఫరాలో కోత విధిస్తున్నారని పలువురు రైతులు, ప్రజలు మండిపడ్డారు. రాత్రివేళల్లో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. లైన్‌మన్‌కు ఫోన్ చేస్తే దురుసుగా మాట్లాతున్నాడని, పైఅధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాగా చేవెళ్ల ఏఈ జానీమోహినుద్దీన్ స్పందిస్తూ వర్షం, ఈదురు గాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతున్నదని తెలిపారు. వీలైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

కోతల్లేకుంటే ధర్నాలెందుకు?

- **బీపాస్‌కు విరుద్ధంగా భవన నిర్మాణ అనుమతుల నిలిపివేత ఆర్-ట్యాక్స్ కోసమా?**
- **ప్రభుత్వాన్ని ఎక్స్ వేదికగా నిలదీసిన కేటీఆర్**

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు కోతలు లేకుంటే ప్రజలు సబ్‌స్టేషన్ల ఎదుట ఎందుకు ధర్నాలు చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'సీఎం రేవంత్‌రెడ్డి కరెంటు కోతలు లేవంటున్నారు. 24 గంటలు నిరంతరం నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నట్టు చెప్తున్నారు. మరి ఇక్కడ సబ్‌స్టేషన్ల ఎదుట ప్రజలు ఎందుకు ధర్నా చేస్తున్నారు? అని సోమవారం ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉప్పల్‌లో కరెంటు కోతలకు నిరసనగా స్థానిక సబ్‌స్టేషన్ ముందు ప్రజలు ఆందోళన చేపట్టిన వీడియోను పోస్టు చేశారు.

ఆర్-ట్యాక్స్ కోసమేనా అనుమతుల నిలిపివేత?

ఆర్-ట్యాక్స్ కోసమే రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతులను నిలిపివేస్తున్నారా? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. 'టీఎస్ బీపాస్ నిబంధనలకు విరుద్ధంగా కొద్ది నెలలుగా భవన నిర్మాణ అనుమతులు ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారు. ఆదాయం గణనీయంగా పడిపోయింది. ఎందుకు ఇలా చేశారు? అనుమతులను నిలిపివేసి, బిల్డర్లపై ఒత్తిడి తేవడం ద్వారా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో ఆర్-ట్యాక్స్ వసూలు చేసేందుకేనా?' అని ఎక్స్ వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. 'టీఎస్ బీపాస్ ద్వారా ఇస్తున్న భవన నిర్మాణ అనుమతుల్లో తగ్గుదల చోటుచేసుకోవడంతో బల్దియా ఆదాయానికి భారీగా గండి పడింది. నిరుడుతో పోలిస్తే ఈ ఏడాది రూ.300 కోట్లు ఆదాయం తగ్గినట్లు గణాంకాలు చెప్తున్నాయి' అని పేర్కొన్నారు. అనుమతులు నిలిపివేయడం వల్ల ఆదాయం తగ్గినట్టు వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలను కేటీఆర్ జతచేశారు.

వాటర్ ట్యాంక్‌లో మృతదేహం

- **పది రోజులుగా అందులోనే డెడ్‌బాడీ**
- **నాలుగు వార్డులకు అదే నీరు సరఫరా**
- **నాటినుంచి అవే నీళ్లు తాగుతున్న జనం**
- **నల్లగొండ జిల్లాకేంద్రంలో కలకలం**
- **ప్రజల్లో ఏమవుతుందోనన్న భయం**
- **అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు**

నీలగిరి, జూన్ 3: నాలుగు వార్డులు, 1,500కిపైగా ఇండ్లకు తాగునీటిని సరఫరా చేసే వాటర్‌ట్యాంక్‌లో కుళ్లిన స్థితిలో ఉన్న ఓ వ్యక్తి మృతదేహం బయటపడడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పది రోజుల క్రితమే ఆ వ్యక్తి చనిపోయినట్టు పోలీసులు అనుమానిస్తుండగా, అప్పటి నుంచి ఆ నీళ్లనే తాగుతున్న జనం ఏమవుతుందోనని హడలిపోతున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం వెలుగుచూసిన ఈ ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన ఆవుల వంశీకృష్ణయాదవ్ (27) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మానసిక స్థితి సరిగా లేని వంశీకృష్ణ గత నెల 24 నుంచి కనిపించడం లేదంటూ స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదుచేశారు. మరోవైపు పాతబస్తీ హిందూపూర్ వాటర్ ట్యాంక్ నుంచి వచ్చే నీళ్లు దుర్వాసన వస్తుండడంతో 11వ వార్డు ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదుచేశారు. సోమవారం మున్సిపల్ సిబ్బంది తో కలిసి ట్యాంకును పరిశీలించగా అందులో ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. మృతుడిని కనిపించకుండా పోయిన వంశీకృష్ణగా గుర్తించారు. ఆ ట్యాంక్ నుంచి పట్టణంలోని 11, 12, 27, 28 వార్డులకు తాగునీరు సరఫరా అవుతున్నది. రోజూ అదే నీటి ని తాగుతున్న ప్రజలు ఇప్పుడు ఏం జరుగుతుందోనన్న భ యంతో వణికిపోతున్నారు. మున్సిపల్ సిబ్బంది రోజుల త రబడి వాటర్‌ట్యాంక్‌లను తని ఖీ చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆగ్రహం వ్య క్తం చేస్తున్నారు.

వ్యక్తి మృతదేహం కనిపించిన వాటర్ ట్యాంకు ఇదే..

ఆవుల వంశీకృష్ణ యాదవ్ (ఫైల్)

కోతుల ఘటన మరువకముందే

వంశీకృష్ణ కనిపించకుండా పోయిన రోజునే ట్యాంకులో పడి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్య క్తం చేస్